క్లుప్తంగా

ఆరబెట్టిన ధాన్యం పరిశీలన



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురులో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. మద్దతు ధరకు మాత్రమే ధాన్యం విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని చెప్పారు. మిల్లర్లు అధికతేమ శాతం చూపిస్తే అధికారులు, లేదంటే తమ దృష్టికి తీసుకొస్తే ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. ధాన్యం అమ్మిన రెండు రోజులకే రైతుల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం తెలుగు ఉభయ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తజనంతో కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగలిశాలల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు అత్యంతభక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఆదివారంతో ఏడో రోజుకు చేరాయి. అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆండాళ్ల గోష్టి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు గోదాదేవి పాడిన పాటలు తిరుప్పావై, శ్రీకృష్ణా పారాయణం భక్తిశ్రద్ధలతో పఠించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచ హారతులను ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన యాగం



మచిలీపట్నంటౌన్: నగరంలోని చమ్మనగిరిపేట గాంధీబొమ్మ శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పుత్ర కామేష్టి యాగం ఆదివారంతో ముగిసింది. 33వ మండల పూజామహోత్సవాల్లో భాగంగా ఈ యాగాన్ని, విశేష ఉత్సవాలను నిర్వహించారు. ఆలయంలో మొదటి సారిగా వేదపండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ యాగ కార్యక్రమాలను ఆలయ శ్రీ ధర్మ శాస్తా భక్త బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు.

'హైందవ శంఖారావం' జయప్రదం చేయాలని ర్యాలీ



బంటుమిల్లి: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసేందుకు హిందూ బంధువులను చైతన్య పరుస్తూ ఆదివారం పలు గ్రామాల్లో సన్నాహక బైక్ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ బంటుమిల్లి శాఖ ఆధ్వర్యంలో సాతులూరు, కొర్లపాడు, నారాయణపురం, మణిమేశ్వరం, ఆర్తమూరు, ముంజులూరు, బర్రిపాడు, కంచడం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. హిందూ బంధువులకు కరపత్రాలు అందజేసి ఆహ్వానిస్తూ గృహాలకు స్టిక్కర్లను అంటించారు. ప్రభుత్వ ఆధీనంలోని దేవాలయాల వద్ద వ్యాపార ధోరణిని, అపచారాలను దృష్టిలో పెట్టుకుని దేవాలయాలను తిరిగి హిందువులకు అప్పగించాలని కోరుతూ ఏర్పాటు చేసిన హైందవ శంఖారావంలో పాల్గొనాలని కోరారు. వీహెచ్‌పీ మండల ప్రతినిధులు ఇల్లూరి నాగబాబు, పుప్పాల నరసింహారావు, కంఠమేని మురళీమోహన్, వసంతరావు, తోకల స్వాములు, సీహెచ్ రాధాకృష్ణ, వి.కరుణకుమార్, యువకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 9వ డివిజన్



బ్రహ్మపురంలో పేరుకుపోయిన చెత్త



స్వైర విహారం చేస్తున్న కుక్కల గుంపులు

- అధ్వానంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ
- స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- అధికారుల పర్యవేక్షణ లోపంతోనే సమస్య

మచిలీపట్నంటౌన్: నగరంలోని 9వ డివిజన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. పారిశుద్ధ్య నిర్వహణ మరింత జఠిలంగా మారటంతో డివిజన్ ప్రజలకు ఇక్కట్లు తప్పటం లేదు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా బ్రహ్మపురం ప్రాంతంలో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే పేరుకుపోయినా వీటిని రోజుల తరబడి తొలగించటం లేదు. దీంతో చెత్తకుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో ఆ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయిన్‌లు పొంగి పొర్లి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అయినా పట్టించుకునేవారు కరువయ్యారు. వినాయకుని గుడి ముందు మురుగునీరు రోడ్డుపై చేరి రోజులు గడుస్తున్నా పట్టించుకోవటం లేదు. ఎక్కువగా రద్దీగా ఉండే ఈ రహదారిలో మురుగునీటితో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో అవి ఎప్పుడు మీద పడతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డివిజన్‌లో సమస్యలు పేరుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని డివిజన్ ప్రజలు వాపోతున్నారు.

పర్యవేక్షణ లోపంతో సమస్య

అధికారుల పర్యవేక్షణా లోపంతోనే డివిజన్‌లో సమస్యల పరిష్కారంలో జాప్యం చోటు చేసుకుంటోందని ప్రజలు వాపోతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో ఆ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ ప్రతి రోజూ డివిజన్లో సంచరిస్తూ అందుబాటులో ఉంటూపారిశుద్ధ్య పనులు దగ్గరుండి చేయించేవారని, కానీ కూటమి పాలన ప్రారంభమైన తర్వాత కార్మికులు, సచివాలయ సిబ్బంది కమిషనర్ ఆదేశాలతో డివిజన్‌లోని కూటమి నేతల పర్యవేక్షణలోనే పని చేయాలని సూచించారు. అయితే పని చేయించే ప్రణాళిక లోపించటంతో ఇబ్బందులు పడాల్సివస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఘనంగా జగన్, పేర్నినాని జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న కార్పొరేటర్ రాంప్రసాద్, కార్యకర్తలు

మచిలీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ల జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామానాయుడుపేటలోని పార్టీ కార్యాలయం వద్ద నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు కార్యకర్తలు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ..

మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పేర్నినాని జన్మదిన వేడుకలను స్థానిక సుకర్లాబాద్‌లోని ఆర్సీఎం స్నేహాలయం వృద్ధాశ్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు. మంచినూనె, గోధుమరవ్వ, కందిపప్పు, చింతపండు, బియ్యం, వేరుశనగ గుళ్ల, మినప్పప్పు తదితర సరుకులను అందజేశారు. డివిజన్ పార్టీ నాయకులు దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు, అప్పారావు, ప్రదీప్, ఆనంద్, రామకృష్ణ, సుధీర్, బాబు, రమేష్, జాన్సన్, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ ఆక్రమణ



గూడూరు: స్థానిక సామాజిక ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారి వెంబడి ఉన్న ఖాళీస్థలం ఆక్రమణలకు గురవుతోంది. జాతీయ రహదారి మార్జిన్‌లో, ఆస్పత్రి ప్రధాన ద్వారానికి ఆనుకుని బడ్డీ కొట్టు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకు అభిముఖంగా ఏర్పాటు చేస్తున్న బడ్డీ వల్ల రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో దర్జాగా బడ్డీ పెడుతున్నా పంచాయతీ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆస్పత్రి ప్రధాన ద్వారం పక్కనే బడ్డీ కొట్టు పెడుతున్నప్పటికీ ఆస్పత్రి అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వెంబడి ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సింహాద్రి కృష్ణారావు ఆదర్శ కమ్యూనిస్టు

విరసం నాయకుడు సీఎస్సార్ ప్రసాద్

బందలాయిచెరువు (అవనిగడ్డ): చివరి వరకూ కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం సింహాద్రి కృష్ణారావు పనిచేశారని విరసం రాష్ట్ర నాయకుడు సీఎస్సార్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని బందలాయిచెరువులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన నక్సలైట్ సింహాద్రి కృష్ణారావు సంస్మరణ సభ ఆదివారం బందలాయిచెరువులో జరిగింది. న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ ఈ కాలంలో ఎర్రజెండా పట్టుకుని బతకడం చాలా కష్టమని, అలాంటిది తుదివరకూ ఎర్రజెండా నీడలోనే కృష్ణారావు జీవించారని కొనియాడారు. తొలుత కృష్ణారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా కళామండలి సభ్యులు ఆలపించిన ప్రజా గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీడీఎం నాయకుడు అరవింద్, జర్నలిస్ట్ భరద్వాజ్, కేవీపీఎస్ నాయుడు కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకుడు మోషే, ప్రజాకళామండలి నాయకుడు జె.కోటేశ్వరరావు, పరుచూరి జనార్ధన్ పాల్గొన్నారు.



సింహాద్రి కృష్ణారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

గణితాన్ని ఇష్టంతో చదవాలి

కృత్తివెన్ను: గణితశాస్త్రవేత్త శ్రీనివాసరామానుజం జీవితం యువతకు ఆదర్శమని ఉపాధ్యాయులు సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో రామన్ జన్మదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2012లో జరిగిన రామన్ 125వ జయంతి వేడుకల్లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రామనుజన్ పుట్టినరోజును గణితదినోత్సవంగా ప్రకటించారన్నారు. సంఖ్యాశాస్త్రంలో రామన్ చేసిన కృషికి గాను భారత ప్రభుత్వం 1962లో ఆయన స్మారక తపాలా బిళ్లను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ గణితాన్ని కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి దేవస్థానానికి వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని దాసాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి దాత రూ. 10 వేలు విరాళాన్ని అందజేశారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు మేడేపూడి రామ్మోహనరావు ఆదివారం ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల ఇక్కట్లు

నాగాయలంక: దివిసీమలో బీఎస్ఎన్ఎల్ సెల్ కస్టమర్లు ఇక్కట్లకు గురవుతున్నారు. నాగాయలంక, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ సిమ్ సర్వీస్‌లతో కాల్స్, నెట్‌వర్క్ పొందుతున్న వినియోగదారులు గత నెల రోజులకు పైబడి నానా ఇక్కట్లు పడుతున్నారు.

నెట్‌వర్క్‌పై అభిమానంతో..

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినందున అభిమానంతో ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు అధిక సంఖ్యలో కొనసాగుతున్నారు. కానీ అదేస్థాయిలో బీఎస్ఎన్ఎల్ సేవలు అందించడంలో సంస్థ అట్టడుగు స్థాయికి దిగజారి పోవడం సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ ప్రాంతంలో నెల రోజుల క్రితం నుంచి వినియోగదారులకు అవసరమైన పీక్ టైమ్‌లో సాయంత్రం నుంచి రాత్రి అయ్యేసరికి నెట్‌వర్క్ పూర్తిగా పడిపోయి వినియోగదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. దీంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

రెండు నెలలుగా..

రెండు నెలల నుంచి వాయిస్ కాల్స్ మాట్లాతున్న సమయంలో వాయిస్ బ్రేక్ అవడంతో ఏం జరుగుతుందో అర్థంకాని స్థితి నెలకొంది. ఆన్‌లైన్లో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం కావడం, టెలిఫోన్ ఎక్చేంజీలలో చెప్పుకునే దిక్కు లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సైతం అధికంగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలనే నమ్ముకోవడంతో తరచూ సర్వర్‌లు షట్‌డౌన్ అవటం పరిపాటిగా మారింది.

వినియోగదారుల హైరానా..

నెట్‌వర్కు హటాత్తుగా మధ్యలో డ్రాప్ అవుతోది. నెట్ వాడేవారి పనులు మధ్యలో ఆగిపోయి నానా హైరానా పడుతున్న పరిస్థితి ఉంది. సంబంధిత బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా అందించేందుకు ఇప్పటికైనా కృషి చేయాలని కస్టమర్లు కోరుకుంటున్నారు.

కోలాహలంగా పైడమ్మ జాతర

- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు
- గూడూరు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్.. రైలు గేటు వేసేందుకు ఆపసోపాలు
- భక్తులను నిలువునా దోచుకున్న కాంట్రాక్టర్లు



పెడన: పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం అత్యంత కోలాహలంగా సాగాయి. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన తొమ్మిదోరోజు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భారీసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, దేవదాయశాఖ సిబ్బందితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గూడూరు రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో శిడిబండ్లు, భక్తులు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పలేదు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జి.సత్యనారాయణ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గూడూరురోడ్డులోని రైలుగేటు వేసే సమయంలో సిబ్బంది ఇబ్బందిపడుతుండటంతో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను నిలుపుదల చేసి రైలు గేటు పడేలా చర్యలు తీసుకున్నారు.

భక్తుల జేబులకు చిల్లు...

పైడమ్మ జాతర మహోత్సవాల నేపథ్యంలో ఆలయం వద్ద ఆయా కాంట్రాక్టులు దక్కించుకున్న కొందరు టీడీపీ నాయకులు భక్తుల నుంచి భారీగా దండుకున్నారు. ఆలయం చుట్టూ మొక్కుబడులు తీర్చుకునేందుకు వచ్చే శిడిబండికి టికెట్ ధరను దేవదాయశాఖ రూ.100 నిర్ణయించగా, సదరు కాంట్రాక్టర్ రూ.400 వసూలు చేయడం దుమారం రేపింది. కోడిపుంజుకు రూ.10 వసూలు చేయాల్సి ఉండగా, ఏకంగా రూ.30 వసూలు చేశారు. ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లకు కూడా అధిక మొత్తంలో వసూలు చేయడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపించాయి.

ఆర్థిక ఎదుగుదలకు ప్రణాళికలు అవసరం

గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జి.కృష్ణవేణి

భావదేవరపల్లి(నాగాయలంక): విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలు ఆర్థిక ఎదుగదలకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకోవలసిన ఆవశ్యకత ఉందని ఘంటశాల కృషి విజ్ఞాన కేంద్రం గృహవి విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జి.కృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక ఎంవీకే రావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ (హైదరాబాద్), కేవీకే(ఘంటసాల) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలువ అధారిత మత్స్య ఉత్పత్తుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేపలు, రొయ్యలలో లభించే పోషకాలు, వివిధ విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్ కుమార్ చేపల పచ్చడి, చేపలతో మురుకుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఫిషరీస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లి అశ్రిత రొయ్యలతో వివిధ బ్రెడ్ అండ్ బ్యాటర్ పదార్థాల తయారీ నేర్పించారు. శిక్షణలో గ్రామానికి చెందిన 30 మంది మహిళలు పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, శిక్షణ పొందే మహిళలు, కళాశాల స్టాఫ్, ఫిషరీస్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గృహవిజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మార్గం

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ ఐవీఎం కార్యాలయంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మనిషిలోని మృగాన్ని పారదోలి మానవత్వాన్ని మేల్కొలిపేందుకు ఏసుక్రీస్తు బోధనలు తోడ్పడతాయని చెప్పారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం మానవాళికి మార్గదర్శకం కావాలన్నారు. ఆయన చూపిన శ్రమ, దయ, కరుణ, ప్రేమతో ప్రతి ఒక్కరూ జీవిస్తే శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. ఐవీఎం ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా 12 మంది పేద విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు, 110 మంది ఐవీఎం విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే, కొనకళ్ళ అందించారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. ఐవీఎం వ్యవస్థాపకుడు డాక్టర్ వేములపల్లి సురేష్- రోజా దంపతులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, వేములపల్లి విజయ, సోఫీ, జి.ప్రసాద్, ఎస్.ఫణి పాల్గొన్నారు.



వృద్ధులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ

జగన్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

మచిలీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ల జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామానాయుడుపేటలోని పార్టీ కార్యాలయం వద్ద నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు కార్యకర్తలు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో నిత్యావసరాల పంపిణీ..

మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పేర్నినాని జన్మదిన వేడుకలను స్థానిక సుకర్లాబాద్‌లోని ఆర్సీఎం స్నేహాలయం వృద్ధాశ్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరుకులను పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన అందజేశారు. మంచినూనె, గోధుమరవ్వ, కందిపప్పు, చింతపండు, బియ్యం, వేరుశనగ గుళ్ల, మినప్పప్పు తదితర సరుకులను అందజేశారు. డివిజన్ పార్టీ నాయకులు దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు, అప్పారావు, ప్రదీప్, ఆనంద్, రామకృష్ణ, సుధీర్, బాబు, రమేష్, జాన్సన్, రవి తదితరులు పాల్గొన్నారు.



పెదకళ్లేపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నరసింహారావు

ఘనంగా ఇరుముడి మహోత్సవం

గూడూరు: అయ్యప్పమాల దీక్షా పరుల ఇరుముడి మహోత్సవం ఆదివారం గూడూరులో ఘనంగా జరిగింది. స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురుస్వాములు గొరిపర్తి బుచ్చిరాజు స్వామి, నిడదవోలు నరసింహారావు స్వాముల చేతుల మీదుగా అయ్యప్పలు ఇరుముడులు ధరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గూడూరు పరిసర ప్రాంతాలకు చెందిన 60 మంది అయ్యప్పలు ఇరుముడులు ధరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అయ్యప్పలను ఘనంగా సాగనంపారు. అయ్యప్ప నామ స్మరణతో రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర పంచాయతీ ఆఫీసు, పెద్దమసీదు, టెలిఫోన్ ఎక్చేంజి సెంటరు మీదుగా గూడూరు సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాలలో శబరిమలకు బయలుదేరారు.



గూడూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులతో అయ్యప్పస్వాములు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని ఆర్తమూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్తమూరు గ్రామానికి చెందిన యువకుడు బంటుమిల్లి నుంచి వస్తున్న సమయంలో గుర్తు తెలియని కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అవగా యువకుడు ఎగిరి దూరంగా పడిపోవడంతో ముఖానికి తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. వాహనదారుడు పారిపోగా స్థానికులు యువకుడిని జాతీయ రహదారి అంబులెన్సులో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి ఎర్రరంగు కారు కారణమైనట్లు చూసిన వారు పేర్కొంటున్నారు. టోల్ గేట్‌వద్ద ఉన్న సీసీ కెమెరా ద్వారా కారును గుర్తించే పనిలో ఉండగా ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.



కారు ఢీ కొని నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం. (ఇన్‌సెట్) గాయపడిన యువకుడు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయ మీటింగ్ హాల్లో వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. బెరాకా మినిస్ట్రీస్ చైర్మన్ బ్రదర్ బీఎస్ కిరణ్‌పాల్, జర్నలిస్టులు కేక్ కట్ చేశారు. బ్రదర్ కిరణ్‌పాల్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ విశిష్టత, యేసుక్రీస్తు జన్మించిన తీరు, పాపుల రక్షణ కోసం ఆయన పడిన శ్రమలను వివరించారు. క్రైస్తవ గీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మీడియా మిత్రుల కుటుంబీకులు సహపంక్తి భోజనాలు చేశారు.